ప్రజాశక్తి
శుక్రవారం 2 జనవరి 2026 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

డోలాయనంలో లబ్ధిదారులు

అస్తవ్యస్తంగా జగనన్న కాలనీలు - గృహ నిర్మాణానికి కొరవడిన అనువైన పరిస్థితులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలో జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు పొందిన వారి పరిస్థితి డోలాయనంలో ఉంది. రికార్డుల్లో స్థలం ఉంది. ప్రతిగా భవిష్యత్తులో ఎక్కడా ప్రభుత్వం నుంచి స్థలాలు తీసుకునే అవకాశం లేదు. అయితే తమకు పట్టాలు ఇచ్చిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి ప్రస్తుతం అనువైన పరిస్థితులు లేవు. దీంతో లబ్ధిదారులు డోలాయనంలో ఉన్నారు.

2020-21లో ఎంపిక చేసిన జగనన్న కాలనీల్లో ప్రభుత్వం ఇళ్ల స్థలాలను కేటాయించింది. ఉమ్మడి జిల్లాలో 2.32 లక్షల ఇళ్లు మంజూరు చేశారు. పట్టణాల్లో సెంటు (48 గజాలు), గ్రామాల్లో సెంటున్నర (72గజాలు) పంపిణీ చేశారు. 2.30 లక్షల ఇళ్ల స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి కూడా దశల వారీగా అనుమతిచ్చారు. 2021 నుంచి 2024 మధ్య కాలంలో 60 వేల ఇళ్లు పూర్తయ్యాయి. గతేడాదిన్నర కాలంలో మరో 15 వేల ఇళ్లు పూర్తి చేశారు. అయితే స్థలాలన్నీ (జగనన్న కాలనీలు) పట్టణాలకు దూరంగా ఎంపిక చేయడం వల్ల చాలా మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి మొగ్గుచూపలేదు. గుంటూరు నగరంలో 60 వేల మంది ఇళ్ల స్థలాలు కేటాయిస్తే కేవలం 6 వేల మంది మాత్రమే ఇల్లు నిర్మించారు. మిగతా స్థలాల్లో కొన్ని కాలనీల్లో గత ప్రభుత్వ హయాంలో మౌలిక సదుపాయలు కల్పన వివిధ దశల్లో ఆగిపోయింది. విద్యుత్ లైన్లు, స్తంభాల నిర్మాణం, తాగునీటి పైపులైన్లు, లోతట్టు కాలనీలను మెరక చేయడం, కాలనీలకు వెళ్లేందుకు రహదారుల నిర్మాణం చేపట్టారు. పనులు కొన్నిచోట్ల పూర్తికాగా మరికొన్ని చోట్ల పలు దశల్లోనే నిలిచిపోయాయి.

గుంటూరు నగరానికి చెందిన 18 వేల మందికి మేడికొండూరు మండలం పేరేచర్ల వద్ద లేఅవుట్‌లో ప్లాట్లు కేటాయించారు. కేవలం 500 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. ఈ ప్రాంతానికి వెళ్లేందుకు వేలాది మంది విముఖత వ్యక్తం చేశారు. వట్టిచెరకూరు మండలం కొర్నెపాడు, గుంటూరు రూరల్ మండలం ఏటుకూరు, తాడికొండ మండలం లాం, దామరపల్లిలో గుంటూరు నగరంలో నివశిస్తున్న లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. వివిధ ప్రాంతాల్లో నిర్మించిన కాలనీల్లో స్థలాలు కేటాయించినా వారికి అనుకూలంగా లేవని చాలా మంది పట్టాలు తీసుకున్నా ఇళ్ల నిర్మాణం కోసం ఆసక్తి లేదు. ఈ స్థలాలను ఏం చేయాలనే అంశంపై ఇంత వరకు లబ్ధిదారులతో అధికారులు, ప్రజా ప్రతినిధులు సమావేశాలు ఏర్పాటు చేయలేదు. పేరేచర్ల, కొర్నెపాడు ప్రాంతాల్లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు గత ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు పెట్టినా ఈ పనులన్నీ వృథాగా మారాయి. కొర్నెపాడు, పేరేచర్ల, లాం, దామరపల్లిలో ఇళ్లు నిర్మించుకోని వారి స్థలాలను కొత్తవారికి ఇవ్వాలని ఎమ్మెల్యేలు పలు సమావేశాల్లో అధికారులను కోరారు. అయితే ప్రభుత్వం వీటిపై ఇంత వరకు విధానపరమైన నిర్ణయం తీసుకోలేదని అధికార వర్గాలు తెలిపాయి.

ప్రధానంగా వివిధ శాఖల మధ్య సమన్వయం కొరవడింది. గుంటూరులో 60 వేల మంది లబ్ధిదారుల ఎంపికలో అప్పట్లో నగరపాలక సంస్థ కమిషనర్ పర్యవేక్షణలో సచివాలయం సిబ్బంది కీలక భూమిక పోషించారు. ఇప్పుడు ఈ అంశం రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల పరిధిలో ఉందని తామేమీ చేయలేమని కార్పొరేషన్ అధికారులు పలు మార్లు కౌన్సిల్ సమావేశంలో పలువురు సభ్యుల ప్రశ్నలకు సమాధానంగా చెబుతూ వస్తున్నారు. మరోవైపు కొత్తగా ఇళ్ల స్థలాల కోసం అధికారులకు దరఖాస్తులు అందుతున్నాయి. ప్రభుత్వం

▶ 2లో

ఘటనా స్థలిని పరిశీలిస్తున్న పోలీసులు

ద్విచక్ర వాహనాలు ఢీకొని

ఇద్దరు పండ్ల విక్రేతలు మృతి

ప్రజాశక్తి - వెల్దుర్తి

రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు పండ్ల విక్రేతలు దుర్మణం పాలైన ఘటన మండలంలోని శిరిగిరిపాడు శివారులో గురువారం జరిగింది. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మాచర్లకు చెందిన కరిముల్లా (50), నూర్జహాన్ (45) మాచర్లలోని అంబేద్కర్ సెంటర్‌లో తోపుడు బండిపై పండ్లు విక్రయిస్తుంటారు. వీరు తమకు కావాల్సిన పండ్లను మార్కాపురంలో తెచ్చుకుంటూ ఉంటారు. ఈ క్రమంలో గురువారం వీరిద్దరూ కలిసి ద్విచక్ర వాహనంపై మార్కాపురానికి వెళ్తున్నారు. శిరిగిరిపాడు శివారులోకి వెళ్లగానే అదే గ్రామానికి చెందిన యువకుడు మరో ద్విచక్రవానంపై ఎదురుగుగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో కరిముల్లా అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలైన నూర్జహాన్‌ను మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా కొద్దిసేపటికి మృతి చెందారు. ఢీకొట్టిన యువకునికి స్వల్ప గాయాలు కావడంతో గ్రామంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతురాలు నూర్జహాన్ మాచర్లకు చెందిన మహిళ కాగా ఆమెకు ఇద్దరు కుమార్తెలున్నారు. వీరు హైదరాబాద్‌లోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. మరో మృతుడు కరిముల్లా సొంతూరు మార్కాపురం కాగా కొన్నేళ్ల కిందట మాచర్లకు వచ్చి ఉంటున్నట్లు తెలిసింది. వెల్దుర్తి ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

పిలుపు మేరకు పుస్తక బహుమతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ఇచ్చిన పిలుపు మేరకు పుష్పగుచ్ఛాలు, శాలువాలకు బదులుగా పుస్తక బహుమతులతో జిల్లా అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మొత్తం 1300 నోటు పుస్తకాలు, 275 పాఠ్య పుస్తకాలు, డిక్షనరీలు, పెద్దబాల శిక్ష, పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఉపయోగపడే వివిధ రకాల స్టడీ మెటీరియల్స్‌ను జిల్లా అధికారులు అందించారు. అధికారులు బహుకరించిన పుస్తకాలను నరసరావుపేట లైబ్రరీకి, హాస్టళ్లలో విద్యార్థులకు అందిస్తామని కలెక్టర్ ప్రకటించారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలో నూతన సంవత్సర వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నేతల కార్యాలయాల్లో వేడుకలను నిర్వహించారు. కేక్ కటింగ్, బోకేలు అందచేయడం, విందులు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కార్యాలయంలో పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ శ్రీవాస్తవ, పలువురు జిల్లా అధికారులు మంత్రిని కలిపి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, నశీర్ అహ్మద్, టిడిపి జిల్లా అధ్యక్షులు పిల్లి మాణిక్యాలరావు, ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ తదితరులు కేంద్ర మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

కేంద్ర మంత్రికి శుభాకాంక్షలు చెబుతున్న గుంటూరు కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే గళ్లా మాధవి

కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. అప్పిరెడ్డికి పలువురు ప్రముఖులు, కార్పొరేటర్లు శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షునికి జిల్లా నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నశీర్ అహ్మద్, మిర్చి యార్డు చైర్మన్‌గా నియమితులైన కుర్రా అప్పారావు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి ఆధ్వర్యంలో వేడుకలు జరగగా సీనియర్ నాయకులు లింగంశెట్టి ఈశ్వరరావు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా పనిచేయండి : ఎస్పీ

సరికొత్త ప్రణాళికలతో ప్రజలకు ఉత్తమమైన పోలీస్ సేవలు అందించేందుకు కృషి చేయాలని పోలీసుల అధికారులకు జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ తెలిపారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఆయన కేకను కట్‌చేసి అందరికీ

▶ 2లో

నేటి నుండి కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ : తహశీల్దార్

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలో రీసర్వే పూర్తైన గ్రామాల్లో పాత భూహక్కుల పత్రాల స్థానంలో కొత్త పట్టాదారుపాసు పుస్తకాల పంపిణీ చేస్తామని తహశీల్దార్ మేరీ కనకం చెప్పారు. గురువారం ఆమె మాట్లాడుతూ శుక్రవారం 9వ తేదీ వరకు ప్రత్యేకంగా రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించి వాటిని అందచేస్తామన్నారు. రాజకీయ ముద్రలు, లోగోలు లేకుండా ప్రభుత్వ చిహ్నంతోనే పాస్‌పుస్తకాలను ముద్రించినట్లు చెప్పారు. వెబ్ ల్యాబ్ డేటాతో కుణ్ణంగా ధ్రువీకరించిన తర్వాతనే అర్హులైన రైతుల జాబితాను తయారు చేశామన్నారు. పశర్లపాడు గ్రామంలో రీ సర్వే పూర్తందని 747 మందికి నూతన పాస్‌పుస్తకాలు ఇస్తామని చెప్పారు.

సమగ్రాభివృద్ధి బులెటెన్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట నియోజకవర్గ సమగ్రాభివృద్ధి, గత నెలలో చేపట్టిన వివిధ ప్రజాహిత కార్యక్రమాలను ప్రతిబింబించే బులెటిన్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, నియోజకవర్గ ప్రత్యేక అధికారివ అయిన ఆర్‌డిఒ కె.మధులతతో కలిసి గురువారం విడుదల చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళిక వింగ్ ప్రొఫెషనల్ పి.వెంకటరావు, సివిఎపియు (కాన్స్టిట్యూయన్సీ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్) బృందం సభ్యులు పాల్గొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడంలో యువ నిపుణుల భాగస్వామ్యం అభినందనీయమని ఎమ్మెల్యే అభినందించారు.

డోలాయనంలో లబ్ధిదారులు

(మొదటి పేజీ తరువాయి)

కొత్తగా పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీకి సంబంధించి ఇంత వరకు ఎటువంటి మార్గదర్శకాలు జారీచేయలేదని కేవలం ఖాళీ స్థలాలను గుర్తించమని మాత్రమే చెప్పిందని జిల్లా అధికారులు తెలిపారు. ప్రజా ప్రతినిదులు మాత్రం చాలా ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న జగన్నన్న కాలనీలలోని స్థలాలపై పరిశీలన చేసి కొత్త వారికి స్థలాలు ఇవ్వాలని అధికారులపై వత్తిడి తెస్తున్నారు. దీంతో స్థలాలు పొందిన వారు తమకు అనువుగా ఉన్న ప్రాంతాల్లో స్థలాలు ఇవ్వాలంటున్నారు. లేదా తాము నివశిస్తున్న ప్రభుత్వ స్థలాలను క్రమబద్ధీకరించి అధికారికంగా పట్టాలు ఇవ్వాలని కోరుతున్నారు. మంగళగిరిలో వివిధ ప్రభుత్వ స్థలాల్లో నివశిస్తున్న పలువురికి మంత్రి నారా లోకేష్ హామీ మేరకు కొంత మందికి క్రమబద్ధీకరించి పట్టాలు ఇచ్చారు. కానీ గుంటూరులో ఈ విధంగా చేయకపోవడం వల్ల ప్రభుత్వ స్థలాల్లో ఏళ్లతరబడి నివాసం ఉంటున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. నగరానికి 10 నుంచి 15 కిలో మీటర్ల దూరంలో ఉన్న జగనన్న కాలనీలకు తాము వెళ్లలేమని, మంగళగిరి తరహాలోనే గుంటూరులో కూడా తమ స్థలాలను క్రమబద్ధీకరించాలని పేదలు కోరుతున్నారు.

ఎడ్ల పందేల్లో విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆధ్వర్యంలో గతనెల 25-31 తేదీల్లో నిర్వహించిన అఖిల భారత ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు విజయవంతంగా ముగిశాయి. చివరిరోజైన బుధవారం రాత్రి రైతులతో కలిసి ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే అరవిందబాబు నూతన సంవత్సర వేడుకలు చేశారు. పోటీలను చూడ్డానికి ప్రజలు భారీఎత్తున తరలిరాగా 2 తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక ఇతర రాష్ట్రాల నుండి దాదాపు 200 జతలకు పైగా ఒంగోలు జాతి ఎడ్లు పోటీల్లో పాల్గొన్నాయి. విజయం సాధించిన ఎడ్ల జతల యజమానులకు ఎంపీ, ఎమ్మెల్యే బహుమతులను ప్రదానం చేశారు. టిడిపి సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ సుబ్బరాయు గుప్తా, కపలవాయి విజయకుమార్, తెలుగు రైతు మండల ప్రధాన కార్యదర్శి మద్దుకూరి బ్రహ్మయ్య, నాయకులు కడియాల తాండవకృష్ణ పాల్గొన్నారు.

రూరల్ పరిధిలో డ్రాప్ బాక్స్‌ల ఏర్పాటు

ప్రజాశక్తి - తెనాలిరూరల్

మాదకద్రవ్యాల నిర్మూలనకు గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సంకల్పం అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టినట్లు తెనాలి డిఎస్పీ బి.జనార్ధనరావు అన్నారు. మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు కళాశాలల్లో ఏర్పాటు చేసిన సంకల్పం డ్రాప్ బాక్సులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ఎస్పీ ఉత్తర్వులు మేరకు మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు సంకల్పం అనే ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు కళాశాలలు, ఆరు ప్రభుత్వ పాఠశాలల్లో సంకల్పం డ్రాప్ బాక్సులను ఏర్పాటు చేశామన్నారు. మాదకద్రవ్యాలను విక్రయించడం, వినియోగించడం తదితర సమాచారాన్ని లేఖ ద్వారా విద్యార్థులు అందించవచ్చన్నారు. ప్రత్యేకించి విద్యా సంస్థల్లో ఏర్పాటుచేసిన డ్రాప్ బాక్సుల్లో ఉత్తరాలను వేసినట్లయితే సమాచారం సేకరించడంతో పాటు వివరాలు తెలిపిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. మాదకద్రవ్యాలకు ఆకర్షితులైన విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి వెళుతుందన్నారు. కొన్ని సందర్భాల్లో నేర కేసుల్లో కూడా ఇరుక్కుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తుపదార్థాలకు బానిసలైన విద్యార్థుల్లో మార్పు తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మాదకద్రవ్యాల వినియోగం వాటివలన కలిగే అనర్థాలను విద్యార్థులకు తెలియజేస్తూ వారిని సరైన దిశలో నడిపించడమే సంకల్పం ప్రధాన లక్ష్యమని తెనాలి రూరల్ సిఐ నాయిబ్ రసూల్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని కళాశాలలో విద్యార్థులతో కలిపి ఈగల్ టీంలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సంకల్పం కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో అవగాహన కార్యక్రమాల్ని విస్తృతం చేస్తున్నట్లు రూరల్ ఎస్సై ఆనంద్ తెలిపారు.

పలువురికి మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ సాయం

ప్రజాశక్తి-గన్నవరం

మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ, గన్నవరం శాఖ ఆధ్వర్యంలో వృద్ధులకు రగ్గుల పంపిణీ, పేద విద్యార్థులకు ఆర్థిక సాయం, వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం గురువారం అందించారు. ఈ సందర్భంగా మానవత స్వచ్ఛందా సేవా సంస్థ చైర్మన్ మడుపల్లి బాలకృష్ణ మాట్లాడుతూ చలి తీవ్రంగా ఉండటంతో కొత్తపేట, చెంచుల కాలనీ, గౌడ పేట, హరిజనవాడ, ఇస్లాం పేట, మర్లపాలెం ప్రాంతాలలోని పేద వృద్ధులకు వంద రగ్గులు పంపిణీ చేశామని అన్నారు. అలాగే పేద విద్యార్థుల విద్యావసరాలకు గాను జి. దివ్యమణి, ఎం. సంతోష్, జి. మహిమరాజులకు రోడ్డు ప్రమాదంలో గాయపడిన సూరగాని శ్రీనివాసరావుకు వైద్య సహాయం కోసం ఒక్కొక్కరికి 3 వేల రూపాయల చెక్కులు అందజేశామని అన్నారు. అధ్యక్ష కార్యదర్శులు వీసం ప్రసాదరావు, వివి కృష్ణమోహన్, కన్వీనర్ కర్రా వరప్రసాద్, ట్రెజరర్ పి. రామకృష్ణారావు, వడ్లమూడి వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : విద్యార్థులకు చదువే ప్రధానమని, క్రమశిక్షణ పట్టుదలతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలనీ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఉద్బోధించారు. నూతన ఆంగ్ల సంవత్సరం పురస్కరించుకుని గురువారం నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశం మందిరంలో కృష్ణ సంకల్పం పేరుతో వినూత్నంగా ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులకు చిన్న సైజు బల్లలు, బాలికలకు సానిటరీ నాప్కిన్ కిట్లు, ముస్తాబు కిట్లు, ఉద్యోగులకు వివిధ రకాల ప్రయోజనాల పత్రాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని పంపిణీ చేశారు. ఈ సందంర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేవలం పుష్పగుచ్చాలు, మిఠా యిలు వలన పెద్దగా ప్రయోజనం లేదని నలుగురికి సహాయం పడే ఏదైనా మంచి పని చేయాలని ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం 'కృష్ణ సంకల్పం" పేరుతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అదేవిధంగా ఈసారి జనవరి ఒకటో తేదీన ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఉపయోగపడే చిన్న సైజు బల్లలను, బాలికలకు శానిటరీ నాప్కిన్ ఇన్ సినీరేటర్లు, ముస్తాబు కిట్లు అందజేసేందుకు ముందుకు వచ్చిన జిల్లా అధికారులందరిని అభినందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం నుండి మంచి స్పందన లభించిందని, మొత్తం 42 బాలికల వసతి గృహాలకు ఇన్సినిరేటర్లు అవసరం కాగా 48 వచ్చాయని, 9 10వ తరగతి పిల్లల కోసం 370 చిన్న సైజు బల్లలు అవసరం కాగా 972 వచ్చాయని వాటిని మిగతా తరగతి పిల్లలకు కూడా పంపిణీ చేస్తామన్నారు. అనంతరం రెవెన్యూ, ఎస్సీ సంక్షేమం, బీసీ సంక్షేమం వ్యవసాయ వైద్య ఆరోగ్యశాఖ లలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులకు సర్వీసు క్రమబద్ధీకరణ,వార్షిక ఇంక్రిమెంట్లు, ఇంక్రిమెంట్ల బకాయిలు, వేతన నిర్ధారణలకు సంబంధించిన మంజూరు పత్రాలను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి శ్రీదేవి, ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు, బీసీ సంక్షేమ అధికారి రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ లక్ష్యంగా గుంటూరు జిల్లా పోలీస్ శాఖను మరింత సమర్ధవంతంగా నడిపిస్తూ, సరికొత్త విధానాలు, ప్రణాళికలతో పనిచేయాలన్నారు. జిల్లా అదనపు ఎస్‌పిలు జి.వి.రమణ మూర్తి, ఎటివి రవికుమార్, సుప్రజ, ఎ.హనుమంతు, వివిధ ప్రాంతాలకు చెందిన డిఎస్‌పిలు, సిఐలు పాల్గొన్నారు. ఐజి కార్యాలయంలో వేడుకలు గుంటూరు రేంజి పోలీసు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఐ.జి. సర్వశ్రేష్ట త్రిపాఠి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్, అదనపు ఎస్‌పిలు పాల్గొన్నారు. రేంజి పరిధిలో అధికారులకు ఐజి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

బౌద్ధారామం అమరావతికి రండి

గవర్నర్‌కు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆహ్వానం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బౌద్ధారామం అమరావతిని సందర్శించాలని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నశీర్‌ను పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు. గురువారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను భాష్యం ప్రవీణ్ కుటుంబ సమేతంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చారిత్రక పట్టణం అమరావతి విశేషాలు, అమలింగేశ్వరస్వామి ఆలయం, ప్రాముఖ్యతను వివరించారు. త్వరలో తప్పకుండా అమరావతిని సందర్శిస్తానని గవర్నర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రేషన్ షాపులో ఆకస్మిక తనిఖీ

అక్రమాలకు తావివొద్దు : ఎమ్మెల్యే గళ్లా మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని అమరావతి రోడ్డులో ఉన్న 44వ డివిజన్ లో ఉన్న రేషన్ దుకాణాన్ని ఎమ్మెల్యే గళ్ళా మాధవి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ సరుకుల నిల్వలు, పంపిణీ విధానం, కార్డు దారులకు అందుతున్న సేవలపై ఆమె సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ పూర్తి పారదర్శకతతో రేషన్ సరుకుల పంపిణీ జరగాలన్నదే ఎన్డీయే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఈ దుకాణంలో రేషన్ దుకాణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటి లాగిన్ వివరాలను అధికారు లకు అందించడం అభినంద నీయమని ఎమ్మెల్యే పేర్కొ న్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఉన్న మొత్తం 90 రేషన్ షాపుల్లోనూ ప్రజా పంపిణీ సక్రమంగా అమల య్యేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి వెల్లడించారు.

తాడికొండ ఎమ్మెల్యేకు సిఐ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

తాడికొండ నియోజకవర్గ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్‌కు ఫిరంగిపురం సిఐ కె.శివరామకృష్ణ, ఎస్ఐ పి. సురేష్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

బలసాని కిరణ్ ను సత్కరిస్తున్న నాయకులు

నగర సమగ్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం : మేయర్

ప్రజాశక్తి - గుంటూరు

గుంటూరు నగర సమగ్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా గురువారం అశోక్ నగర్ లోని ఆయన క్యాంపు కార్యాలయంలో నగర్ కమిషనర్ పులి శ్రీనివాసులు, అదనపు కమిషనర్ ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, నగర పాలక సంస్థ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది కలిసి నూతన సంవత్సర శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ఈ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా, సుఖ, శాంతులతో ఉండాలని కోరుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా జరుగుతున్నాయని, గుంటూరు నగరంలో కూడా ఇప్పటికే సుమారు రూ.550 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నా యన్నారు. అలాగే గుంటూరు నగరంలో దీరెకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించటం జరిగిందన్నారు. నగరంలో తాగు నీరు, పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించామని, ప్రజలకు ఎటువంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది ప్రజల సమస్యలను త్వరితగతిన

పరిష్కరిస్తూ, నగరాభివృద్ధికి అందరిని సమన్వయం చేసుకుంటూ పనిచేయాలన్నారు. రానున్న కాలంలో గుంటూరు నగరాభివ ద్ధి మరింతగా కృషి చేస్తామని తెలియచేశారు.

బలసాని కిరణ్‌కుమార్‌కు పలువురు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - పెదనందిపాడు

నూతన సంవత్సరం సందర్భంగా వైసిపి ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ బలసాని కిరణ్ కుమార్‌ను పెదనందిపాడు మండల కన్వీనర్ షేక్ కాసిం పీరా, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులు చెరుకూరి శ్రీనివాసరావు, పిఎసిఎస్ మాజీ చైర్ పర్సన్ దివ్వి నాగేశ్వరరావు తదితర నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పూలదండ, శాలువాతో బలసాని కిరణ్‌ను సత్కరించారు. పెదనందిపాడు మండలం ప్రజలకు, అధికారులకు షేక్ కాసిం పీరా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

విశ్వసాహితీ కళావేదిక కవి సమ్మేళనం

ప్రజాశక్తి - తెనాలి

విశ్వ సాహితీ కళావేదిక, శ్రీకృష్ణ దేవరాయ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని స్థానిక గాంధీనగర్ సిపిఐ కార్యాల యంలో గురువారం రాత్రి కవి సమ్మేళనం నిర్వహించారు. సినీ రచయిత బొల్లిముంత శివరామకృష్ణ పై రంగి శెట్టి రమేష్ రచించిన గేయాన్ని ఆవిష్కరించారు. పలువురు కవులు కవి సమ్మేళనంలో తమ కవితలను వినిపించారు. ఈ సందరరేగా బొల్లి ముంత కృష్ణను సత్కరించారు. కార్యక్రమంలో సహజకవి అయినాల మల్లేశ్వరరావు, విశ్వ సాహితీ కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులుకొల్లి రమావతి, శ్రీకృష్ణ దేవరాయ కళావేదిక, రంగిశెట్టి ఫౌండేషన్ చైర్మన్ రంగిశెట్టి రమేష్, బెజ్జంకి నాగమణి వసంత యామిని, శ్రీదేవి, ఆర్ నరసింహారావు, వి శ్రీరామమూర్తి, చందు సూర్య, విజయ సారధి ఎం నరసింహాచారి, షేక్ అస్మతున్నీసా, బెల్లంకొండ వెంకట్ దొంతు ప్రభావతి పాల్గొన్నారు.

8 మంది జూదరులు అరెస్టు

రూ.19700 నగదు స్వాధీనం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పేకాట స్థావరంపై దాడిచేసి 8మంది జూదరులను అరెస్టు చేసి వారివద్ద నుండి రూ.19వేల 7వందల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ అమినుద్దీన్ తెలిపారు. సత్తెనపల్లి మండలం పాకాలపాడు గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ సిబ్బంది తో దాడిచేశారు. వీరివద్ద నుండి నగదు తో పాటు 5 సెల్ ఫోన్లు ,6 బైకులు స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు . కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

డాక్యుమెంట్ పోయినది

నేను అనగా చిమట సుజాత భర్త, చిమట గంగాధరరావు, కాకర్లమూడి గ్రామం, వేమూరు మండలంకు చెందిన నా యొక్క డాక్యుమెంట్ నెం. 1053/2005 ది. 16-9-2005వ తేదిన తెనాలి (వెస్ట్) సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయములో రిజిష్టరు చేయబడిన డాక్యుమెంటును తేది. 30-12-2025వ తేదీన కాకర్లమూడి గ్రామం నుండి వేమూరు మండల తహశీల్దారు వారి కార్యాలయమునకు వెళ్ళుచుండగా మార్గమధ్యంలో పై తెల్పబడిన డాక్యుమెంట్ కవరు జారిపోయినది. పై తెల్పబడిన డాక్యుమెంట్ను ఎరికైనా దొరికిన యెడల ఈ క్రింది సెల్ నెంబరుకు తెలియజేయవలసినది.

చిమట సుజాత.

సెల్ నెం.7569537643, 9553092024

నోటీసు

మహారాజ శ్రీతెనాలి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో

ఐ.ఎ. 230/2024 ఇన్ ఓ.యస్.నెం. 15/2024

బిట్వీన్ :

Nuthalapati Triveni, W/o Baji Chowdary, Tenali ..... పిటీషనర్/ 5th Defendent

ఎదిరి

Mutehu Koti Prabha (1st Plaintiff) and others .... రెస్పాండెంట్స్

To,

R4 : Katta Kanaka Durga (1st Defendent) W/o Nageswara Rao, D.No. 4-8-73, Near Tank Bund, Koritapadu, Guntur.

పై నెంబరు దావాలో ఐ.ఎ. 230/2024 పిటీషన్‌లో మీకు శ్రీ కోర్టు ద్వారాను మరియు పోస్టు ద్వారాను నోటీసులు పంపించినను మీరు తీసుకోనందున ఈ ప్రకటన ద్వారా నోటీసు నిమిత్తం శ్రీ కోర్టువారు ఆర్డరు వేస్తూ మీ హాజరు కొరకు ది. 23-01-2026 తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల సదరు పిటీషన్‌ను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)

వాయిదాతేది : 23-01-2026

ఎం.పి.భీమేశ్వర్,
పిటీషనర్ తరఫు అడ్వకేట్,
తెనాలి. సెల్ : 9133331157

మహారాజశ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) గారి కోర్టులో....

I.A. No. 515/2025 IN I.A.No. 93 / 2024 IN A.S. 230/2024

గజవల్లి ఆదినారాయణ ... పిటీషనర్/అప్పిలెంట్

V/s

అర్వపల్లి రామకృష్ణమూర్తి (లేటు) మరియు ఇతరులు ... ప్రతివాదులు

To,

1) R6: అర్వపల్లి కావ్య (తండ్రి) శివశంకర్, స్టూడెంట్, హిందూ, వయస్సు 24 సం॥లు, నివాసము వెంకటేశ్వర ప్లాజా, ప్లాట్ నెం.102, డోర్ నెం. 12-4-31, ప్రకాష్ నగర్, నరసరావుపేట టౌన్ & మండలం, పల్నాడు జిల్లా

2)R8: బొగ్గవరపు కోటేశ్వరి W/o సైదారావు, D/o అర్వపల్లి రామకృష్ణమూర్తి, హిందూ, గృహిణి, మెయిన్ రోడ్డు, సాయి గణేష ఖాదీ బండార్, పిడుగురాళ్ళ టౌన్, పల్నాడు జిల్లా.

పై నెంబరు అప్పీలు దావాలో ఐ.ఎ.నెం. 515/2025 లో ఐ.ఎ.నెం. 93/2024 లో అప్పీలు నెం. 230/2024 పిటీషన్లో 1వ రెస్పాండెంట్ వారు మరణించినందున వారి వారసులుగా మిమ్ములను దావా నందు రెస్పాండెంట్ నెం. 6 మరియు 8 లుగా చేర్చుట కొరకు శ్రీ కోర్టు వారు మీకు పలుమార్లు సమన్లు పంపగా, మీరు ఉద్దేశ్య పూర్వకంగా తీసుకోనందున, శ్రీకోర్టువారు మీకు ఈ పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసు నిమిత్తమై ఉత్తర్వులు జారీ చేసినందున ది. 09-01-2026 వ తేదీ ఉ॥ 10-30 ని॥ లకు, మీరు పై కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ లేదా వకీలు ద్వారా కానీ హాజరై మీకు గల ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకోవలసినది. లేనియెడల, మీ పరోక్షమందు, చట్ట ప్రకారము తీర్మానము చేయబడునని ఈ పేపర్ పబ్లికేషన్ ద్వారా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేదీ. 09-01-2026

ఇట్లు.
శ్రీ కె.సీతారామాంజనేయులు,
శ్రీ బి. గోపిరాజు,
అప్పిలెంట్ తరుపు అడ్వకేట్స్,
నరసరావుపేట.
సెల్: 9390511530

జనరల్ నోటీసు

IN THE COURT OF THE ADDLSENIOR CIVIL JUDGE : TENALI, (SENIOR DIVISION)

C.R I.P 74/2025

Between:

Padala nagi Reddy .... Petitionor

V/s

R1 : Kanamala Mariya Kumar

R2 : Korra Manga

R3 : The Offcial Receiver - Guntur .... Respondends

పై నెంబరు గల ఇ.పి.లో పిటిషర్‌ను తనను ఇన్సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుచు పిటిషన్‌ను దాఖలు చేయగా సదరు పిటిషన్‌పై ఎవరికైనా అభ్యంతరాలు వుంటే తెలుపుకోమని శ్రీ కోర్టువారు జనరల్ నోటిస్‌కు ఆర్డరు వేస్తూ మీ హాజరు నిమిత్తము ది. 07-01-2026 తేది వాయిదా వేసి ఉన్నారు. సదరు వాయిదా రోజు ఉదయం 10:30 ని॥లకు మీరు స్వయంగా గానీ, మీ తరుపున న్యాయవాది ద్వారా గాని, శ్రీ కోర్టువారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనవలెను. లేని యెడల సదరు పిటీషన్‌ను మీ పరోక్షయున విచారించి తీర్మానించబడునని యావన్మందికి తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)

వాయిదాతేది : 07-01-2026

ఇట్లు
ఆవుల భాను ప్రకాష్,
తాడిశెట్టి వెంకటేశ్వరరావు
అడ్వకేట్స్, తెనాలి.
సెల్ నెం: 7013601119,9703526999.

ప్రకటన

ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, గుంటూరు బ్రాంచ్ మేనేజర్ గారి సంజాయిషీ పొంది యావత్ మందికి తెలియజేయునది ఏమనగా వేమవరపు వెంకటరత్నం గారి కుమారుడు వేమవరపు రామమోహన్ రావు గారు, గుజ్జర్లపూడి అరుణ్ కుమార్ భార్య కూచిపూడి డోర్కాస్ వారి వద్ద నుండి పల్నాడు జిల్లా, సత్తెనపల్లి మున్సిపాలిటీ ఏరియాలో చేరిన, సత్తెనపల్లి లోని, క్రిస్టియన్ పేట నందలి, సత్తెనపల్లి గ్రామ డి.నెం.200/1ఎ1 లో 156 చ.గ ల స్థలము అందులో RCC గ్రౌండ్, ఫస్ట్, సెకండ్ మరియు థర్డ్ ఫ్లోర్ డాబాను కొనుగోలు చేయుటకు మా క్లయింట్ అయిన ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారి వద్దకు LOAN నిమిత్తం వచ్చి ఉన్నారు. కావున ఈ ఆస్తిపై ఎవరికైనా ఏమైనా అభ్యంతరం ఉన్న యెడల వారం రోజులలోపల ఈ క్రింది అడ్రసుకు తెలియజేయవలసినదిగా కోరుచున్నాము. లేని యెడల మా క్లయింట్ వారు ఎవరకి అభ్యంతరం లేదని పరిగణించి లోను ఇవ్వబడును.

ఇట్లు
కాసు వెంకట రెడ్డి (అడ్వకేట్) B.Com., B.L.
డోర్ నెం.6-14-13,
14/3 అరండల్ పేట్, గుంటూరు.
సెల్ నెం- 9346983822.

దస్తావేజులు పోయినవి

పల్నాడు జిల్లా అమరావతి మండలం దిడుగు గ్రామానికి చెందిన దామచర్ల శివ సాయి కృష్ణ ప్రసాద్ అయినటువంటి నాకు వారసత్వంగా సంక్రమించిన ఒరిజినల్ దస్తావేదులు 16-12-2025వ తేదీన దిడుగు గ్రామం నుండి అమరావతి బస్సులో ప్రయాణిస్తుండగా దస్తావేజులు కనిపించకుండా పోయినవి. ఈ దస్తావేజులు నా తండ్రి దామర్ల రమేష్ గారి ద్వారా దిడుగు గ్రామ సర్వేనెంబర్ 195-బి లో 765/1994 డాక్యుమెంట్ ద్వారా య 1.00 భూమి పెదకూరపాడు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్టర్ కాబడినవి. కావున యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఈ దస్తావేజుల ద్వారా ఎవరైనా అక్రమ రిజిస్ట్రేషన్ పాల్పడిన ఆ దస్తావేదులు చెల్లవు. అంతేకాకుండా ఎవరికైనా ఈ దస్తావేజులు దొరికిన ఈ క్రింది అడ్రస్ కానీ, లేదా ఫోన్ నెంబర్-984833432 సమాచారం ఇవ్వగలరని మనవి.

ఇట్లు
దామచర్ల శివ సాయి కృష్ణ ప్రసాద్
దిడుగు గ్రామం, అమరావతి మండలం,
పల్నాడు జిల్లా

ఆస్తులను రక్షిస్తున్న వారికే రక్షణ కరువు

- వణికించే చలిలోనే వాచ్‌మెన్‌ల విధి నిర్వహణ
- కూర్చునే సదుపాయాలకూ నోచక అవస్థ
- నిద్రమాని కాపలా కాస్తున్నా అరకొర వేతనాలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

వయస్సు మీరింది.. జీవనోపాధి కష్టమైంది.. ఇంట్లో వారికి భారం కాకూడదు.. ఏదో ఒక పని చేసుకుని నాలుగు రూపాయలు సంపాదించుకోవాలి.. అయినా వారు చేయగలిగే పనులేమీ కనిపించడం లేదు.. చివరికి వాచ్‌మెన్‌లుగా కుదురుకుని రేయింబవళ్లు చలికి, వానకు, ఎండకు నానా అవస్థలు పడుతూ విధి నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం గజగజ వణికిస్తున్న చలిని తట్టుకుంటూ ఆస్తులకు రక్షణ కల్పిస్తున్న వాచ్‌మెన్‌లకే రక్షణ కరువైంది.

పట్టణంలోని వివిధ సంస్థలు, పరిశ్రమలు, ప్రముఖుల ఇళ్లు, అపార్టుమెంట్లు, ఎటిఎంలు, దుకాణాలు, భవన నిర్మాణాలు, వెంచర్లు, స్టోరేజీలు, గ్రానైట్ క్వారీల వద్ద 700 మంది వరకూ వాచ్‌మెన్‌లుగా పని చేస్తున్నారు. నియోజకవర్గంలో ఈ సంఖ్య 1500కు పైగానే ఉంటుందని అంచనా. నరసరావుపేట కేంద్రంగా నడుస్తున్న ఏజెన్సీ ద్వారా వీరు పనిలో చేరతారు. కొన్నిచోట్ల రెండు షిఫ్టులు, కొన్నిచోట్ల మూడు షిఫ్టులు చొప్పున వీరు డ్యూటీలు చేస్తుంటారు. ఒక చేతిలో కర్ర, మరో చేతిలో లైటు పట్టుకొని పహారా కాస్తుంటారు. వీరిలో కొద్దిమంది మినహా మిగతావారికి చలి, వాన నుండి రక్షణ కోసం చలికోట్లు, దుప్పట్లు, వంటివి లేవు. సెక్యూరిటీ ఏజెన్సీ ఇచ్చిన యూనిఫాం వేసుకునే కాపలా కాస్తుంటారు. బూట్లు ఇచ్చిన అవి సరిగా ఉండక కాపలాదార్లే సొంతంగా కొనుక్కోవాల్సి వస్తోంది. తాగునీరు, మరుగుదొడ్ల సంగతి అలా ఉంచితే కొంతమందికైతే కనీసం కూర్చోవడానికి చిన్న స్టూల్ కూడా లేదు. భవన నిర్మాణాల వద్ద వాచ్‌మెన్‌ల పరిస్థితి మరీ దయనీయం. తాత్కాలిక గుడారాల కింద లేదా, ఫ్లోర్లల్లో వీరు తలదాచుకుంటూ కాపలా కాస్తున్నారు. నెలకు రెండు మూడ్రోజులకు మించి సెలవులు ఉండవు.

అంతకు మించితే జీతాల్లో కోత విధిస్తున్నారు.

ఇంత కష్టించి కాపలా కాస్తున్న వీరికి కనీస వేతనాలేమీ అమలు కావడం లేదు. వాచ్‌మెన్‌గా రూ.8 వేలు వస్తుండగా అదనంగా బట్టలుతికి ఇస్త్రీ చేయడం ద్వారా కొంత సంపాదిస్తూ జీవనం సాగిస్తున్నామని ఓ అపార్టుమెంట్ వాచ్‌మెన్ తెలిపారు. ఎటిఎంల వద్ద, షోరూంల వద్ద రాత్రిళ్లు చేసేవారు రాత్రివేళల్లో నిద్రమానుకుని 12 గంటలపాటు (రాత్రి 7 గంటల నుండి ఉదయం 7 గంటల వరకు) విధుల్లో ఉంటున్నా వీరికిసైతం రూ.10-12 వేలకు మించి దక్కడం లేదు. రాత్రివేళల్లో పనిచేసే వారంతా 55 ఏళ్ల పైబడినవారే. ఇతర పనులు చేయలేక భవన నిర్మాణం వద్ద రూ.7 వేలకు రాత్రిళ్లు వాచ్‌మెన్‌గా ఉంటున్నానని, ఇటీవల చలిపెరిగి ఇబ్బందిగా ఉన్నా పూటగడవడం కోసం డ్యూటీ తప్పడం లేదని, సొంత డబ్బులతో చలికోటు, దుప్పట్లు సమకూర్చుకున్నట్లు 60 ఏళ్ల యోహాను వాపోయారు. ఈ నేపథ్యంలో తమ సంక్షేమం పైనా ప్రభుత్వం దృష్టి సారించాలని వాచ్‌మెన్లు కోరుతున్నారు.

కార్మిక, కర్షక ఐక్యతతో ప్రజా పోరాటాలు విజయవంతం కావాలి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

నూతన సంవత్సర స్ఫూర్తితో కార్మిక, కర్షక ఐక్యతతో ప్రజా పోరాటాలు విజయవంతం కావాలని సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య అన్నారు. స్థానిక పుతుంబాక భవన్ ఆవరణలో గురువారం జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి సిపిఎం మండల కార్యదర్శి పి.మహేష్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చలమయ్య మాట్లాడుతూ అమెరికన్ సామ్రాజ్య వాదం ప్రపంచ ఆధిపత్యం సాధించడం కోసం తన మిత్రుల పైనే ఆంక్షలు విధించి శత్రుత్వాన్ని పెంచుకుంటూ తానుగా బలహీనపడుతోందని అన్నారు. ప్రపంచ పెట్టుబడిదారీ విధానం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందని చెప్పారు. ఈ నేపథ్యంలో కార్మిక, కర్షక ఐక్యతతో నూతన సంవత్సర స్ఫూర్తితో పోరాటాలను తీవ్రతరం చేసి విజయాలు సాధించాలని చెప్పారు. ఈ సందర్భంగా పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ సూర్య ప్రకాశరావు ఆధ్వర్యంలో మహిళలు వేసిన సుత్తి కోడలి నక్షత్రం సింబల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య, నాయకులు జి.బాలకృష్ణ, ఎ.వీరబ్రహ్మం, కె.జగన్, పి.ప్రభాకర్, ఎ.వెంకటనారాయణ, జి.ఉమశ్రీ, జి.రజిని, ఎం.భారతి, రోహిత, దేవాన్ష పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణలో పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

యుటిఎఫ్ పల్నాడు జిల్లా కమిటీ ప్రచురించిన 2026 డైరీ, క్యాలెండర్‌ను నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని కోరారు. నూతన సంవత్సరం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావాలని, కూటమి ప్రభుత్వం ఆ దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దుకూరి మోహనరావు మాట్లాడుతూ యుటిఎఫ్ డైరీలో ఉపాధ్యాయ సర్వీస్ రూల్స్‌తో పాటు విద్యా సంబంధిత సంపూర్ణ సమాచారం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన పిఆర్సీ, ఐఆర్ సాధన, రావాల్సిన ఆర్థిక బకాయిల సాధన కోసం యుటిఎఫ్ అగ్రభాగాన ఉంటూ కలిసొచ్చే ఉపాధ్యాయ సంఘాలను ఏకం చేసి పోరాటం చేస్తామని చెప్పారు. ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరగడానికి యుటిఎఫ్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ పల్నాడు సహాధ్యక్షులు జెవిడి నాయక్, ఎ.భాగేశ్వరిదేవి, కోశాధికారి ఎం.రవిబాబు, కార్యదర్శులు ఉషా శౌరిరాణి, ఎం.రామాంజనేయులు, ఆడిట్ కమిటీ కన్వీనర్ అజయ్ కుమార్, జి.ఆంజనేయులు నాయకులు టి.వెంకటేశ్వర్లు, ఎన్.సుందరావు, నరసరావుపేట, ఈపూరు, ముప్పాళ్ల మండలాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రెంటచింతల

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను నాయకులు ఆవిష్కరించారు. అధ్యక్షులు నాసరయ్య, ప్రధానకార్యదర్శి కిషోర్, నాయకులు సునీల్, మేరీజోష్ణ, సుధీర్, ప్రియాంక, శిరీష, సురేష్, రాజ్‌కుమార్, ప్రతాప్, సుబ్బారావు పాల్గొన్నారు.

పంపిణీకి 28 వేల పట్టాదారు పాస్‌పుస్తకాలు సిద్ధం

నేటి నుండి 9వ తేదీ వరకూ గ్రామ సభలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట నియోజకవర్గంలోని నరసరావుపేట, రొంపిచర్ల మండలాల పరిధిలో రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో 28 వేల పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీకి రంగం సిద్ధం చేసినట్లు నరసరావుపేట తహశీల్దార్ కె.వేణుగోపాలరావు, రొంపిచర్ల తహశీల్దార్ బి.నిర్మల గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. నరసరావుపేట మండలంలో 15 వేలు, రొంపిచర్ల మండలంలో 13 వేలు పాస్‌పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం రీసర్వే పూర్తయిన గ్రామాల్లో శుక్రవారం నుండి 9వ తేదీ వరకు ప్రత్యేక గ్రామ సభలు ఏర్పాటు చేస్తామని, తప్పులకు తావులేకుండా రైతులకు పారదర్శకంగా పుస్తకాలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. రీ సర్వే పూర్తయిన రైతులకు ఆయా గ్రామాల విఆర్ఒలు ముందుగానే సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక ఆర్‌టిసి డిపో మేనేజర్ రాంబాబును స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) నాయకులు గురువారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ డైరీని డిఎం ఆవిష్కరించి మాట్లాడారు. సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి తేవాలని, తన పరిధిలోని అంశాలను పరిష్కరిస్తానని చెప్పారు. సంస్థ నిర్వహణలో యూనియన్ సహకారం బాగుందని, ఇకమీదటా ఇదే సహకారం కొనసాగిస్తూ డిపో అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో అధ్యక్ష కార్యదర్శులు యోహాన్, ఫణిరాజ్‌కుమార్, రీజనల్ నాయకులు జి.వి.సుబ్బారావు, నరసింహార్సవు, జాయింట్ సెక్రటరీ వి.జి.నాయక్, గ్యారేజ్ నాయకులు ఎన్.సాంబశివరావు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్‌లో ప్రజాశక్తి 2026 క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ప్రజాశక్తి దినపత్రిక మరింత ప్రజాదరణతో దినదినాభివృద్ధి సాధించాలని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంగూరి అజయ్ కుమార్ అన్నారు. కోర్టు సెలవులతో కూడిన ప్రజాశక్తి 2026 క్యాలెండర్‌ను అజయ్ కుమార్‌తోపాటు ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య, టిడిపి నియోజకవర్గ యువ నాయకులు మన్నెం శివ నాగమల్లేశ్వరరావు (అబ్బూరు మల్లి) గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మణిబాబు, న్యాయవాదులు సాయిశ్రవణ్, హరీష్, లక్ష్మణ్, ఆకుల నాగార్జున, శ్రీకాంత్, టిడిపి నాయకులు పోట్ల వీరాంజనేయులు, చందు, రాంబాబు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగం కేసులో యర్రబాలెం పిఎసిఎస్ సిఇఒ అరెస్ట్

గుమస్తా నుంచి సిఇఒగా ఎదిగి, రైతులను మోసగించిన వైనం

కేసు వివరాలు వెల్లడించిన సిపిఎస్ డిఎస్‌పి బివి మధుసూదనరావు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి మండలం కురగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) నిధుల దుర్వినియోగం కేసులో మరో నిందితుడిని గుంటూరు జిల్లా సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. ఇప్పటికే ఈ కేసులో కురగల్లు సిఇఒ రాయల రమేష్ బాబును అరెస్టు చేసిన విషయం విదితమే. సిపిఎస్ డిఎస్‌పి బీవీ మధుసూధనరావు కేసుకు సంబంధించిన వివరాలను గురువారం మీడియాకు వెల్లడించారు. మంగళగిరి మండలం కురగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈ ఓ) రాయల రమేష్ బాబు మరికొంత మంది ఉద్యోగులతో కలసి మోసపూరిత కార్యకలాపాలకు పాల్పడుతూ సొసైటీ డిపాజిటర్ల నుండి డిపాజిట్లు సేకరించి వారికి నకిలీ బాండ్లను జారీ చేసి వాటినే ఒరిజినల్ బాండ్లుగా నమ్మించి డిపాజిటర్లకు తామే నేరుగా వడ్డీని చెల్లిస్తూ... డబ్బును బ్యాంకులో జమ చేయకుండా ఆ నిధులను దారి మళ్ళించి 72 మంది డిపాజిటర్ల వద్ద నుంచి రూ. 8,50,93,947 లు స్వాహా చేశారని తెలిపారు. కురగల్లు పీఏసీఎస్‌లో 112 నకిలీ డిపాజిట్ బాండ్లను జారీ చేసి రైతులను మోసగించారని పీఏసీఎస్ చైర్మన్ శీలం గోపయ్య మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో అప్పట్లో ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును గుంటూరు సీసీఎస్ డీఎస్పీ బీవీ మధుసూదనరావు దర్యాప్తు చేపట్టారు. నిధుల దుర్వినియోగం వ్యవహారంలో కురగల్లు సీఈవో రాయల రమేష్ బాబుతో పాటు యర్రబాలెం పీఏసీఎస్ సీఈవో తాడిబోయిన శ్రీకాంత్ పాత్ర కూడా ఉందని నిర్ధారించుకొని అతని కదలికలపై నిఘా ఉంచి బుధవారం మంగళగిరి ఆర్టీసీ బస్టాండ్ వద్ద అరెస్టు చేశారు.

తీగలాగితే డొంక కదిలింది...

మంగళగిరి -తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెంకు చెందిన తాడిబోయిన శ్రీకాంత్ 2012 సంవత్సరం జులై నెలలో కురగల్లు పీఏసీఎస్‌లో టెంపరరీ గుమస్తాగా నెలకు రూ.3వేల జీతంపై చేరాడు. కురగల్లు పీఏసీఎస్ సీఈవో రాయల రమేష్ బాబుతో పాటు మరికొంతమందితో కుమ్మక్కై దొంగ లెక్కలు రాస్తూ అదే పీఏసీఎస్‌లో పర్మినెంట్ గుమస్తాగా పదోన్నతి పొందాడు. సొసైటీ నియమాల ప్రకారం సొసైటీ లో డిపాజిట్ దారులు డబ్బులు జమ చేసినప్పుడు డిపాజిట్ దారులకు ఇచ్చే బాండ్లపై అతను, సీఈవో సంతకాలు చేసి ఇవ్వాల్సి ఉంది.

మీడియాతో మాట్లాడుతున్న డిఎస్‌పి మధుసూదనరావు

కానీ గుమస్తా శ్రీకాంత్ ఎప్పుడూ బాండ్లపై సంతకాలు చేయలేదు. డిపాజిట్ దారులు డిపాజిట్ చేయటానికి వచ్చినప్పుడు వారి నుండి డబ్బులు తీసుకుని ఆ డబ్బులను సీఈఓ కు అప్పగించి ఆ వివరాలు క్యాష్ బుక్ లో నమోదు చేయకుండా సాధారణ డైరీలో నమోదు చేశాడు. ఇది మోసం అని తెలిసి కూడా సొసైటీని అడ్డుపెట్టుకుని ఈ మొత్తం వ్యవహారంలో నిందితులు ఒక పథకం ప్రకారం కుమ్మక్కై రైతులకు నకిలీ బాండ్లు ఇచ్చి వారికి నమ్మకద్రోహం చేసి వారి నుండి వసూలు చేసిన సొమ్మును దారి మళ్ళించి వారి అవసరాలకు వాడుకుని దుర్వినియోగం చేసినట్లు సీసీఎస్ డీఎస్పీ మధుసూదనరావు తెలిపారు. ఈ కేసులో ఇంకా ఎవరెవరి పాత్ర ఉన్నదన్న దానిపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు ఆయన తెలిపారు.

అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు

మున్సిపల్ అవుట్ సిబ్బందికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నగర ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు కోరారు. గురువారం ఏటి అగ్రహారం మున్సిపల్ రిజర్వాయర్‌లో గండికోట శ్రీనివాసరావు, చల్లా వెంకయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా తోటి కార్మికులు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముత్యాలరావు మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచుతామని, ఉద్యోగ విరమణ సందర్భంగా 10 సంవత్సరాల సర్వీసు ఉన్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రూ.75లు, అదనంగా సంవత్సరానికి రూ.2వేలు చొప్పున ఇస్తామని టిడిపి హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చాక హామీలను విస్మరించిందన్నారు. 60 సంవత్సరాలు నిండాయని కార్మికుల్ని రిటైర్మెంట్ చేసి ఒట్టి చేతులతో ఇంటికి పంపిస్తున్నదని విమర్శించారు. వెంటనే ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇఇ విష్ణుమూర్తి, డిఈ వెంకట రమణ, ఏఈ ప్రసాద్ పాల్గొని శ్రీనివాసరావు, చల్లా వెంకయ్యకు ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందిని అభినందిస్తున్న అధికారులు, యూనియన్ నాయకులు, అధికారులు

కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బి. లక్ష్మణరావు, నాయకులు షేక్ ఖాసిం షహీద్, యూనియన్ జిల్లా అధ్యక్షులు పూనేపల్లి శ్రీనివాసరావు, అజ్మతుల్లా, రత్నబాబు, వెంకట్, ఏసుబాబు, సురేష్, గండికోట సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో అభివృద్ధి మరింత వేగవంతం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రాష్ట్రాభివృద్ధి ఒక పక్క, రాజధాని అభివృద్ధి మరోపక్క, పోలవరం సాధన, నదుల అనుసంధానం కూటమి ప్రభుత్వం అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. న్యూ ఇయర్ సందర్భంగా తెనాలి పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పార్టీ శ్రేణులతో కలిసి 2026 నూతన సంవత్సర భారీకేక్‌ను కట్ చేశారు. రాష్ట్రంలో ప్రజలకు అభివృద్ధి సంక్షేమం కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో అందిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు ఈ నూతన సంవత్సరం సిరులు కురిపించాలని ఆకాక్షించారు. నియోజకవర్గ పరిధిలో కార్యకర్తలు నాయకులు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో న్యూ ఇయర్ వేడుకలు

ప్రజాశక్తి- తాడేపల్లి

నూతన సంవత్సరం 2026 సందర్భంగా తాడేపల్లి మెయిన్ రోడ్డు లోని టిడిపి కార్యాలయంలో ఎదుట రోడ్డుపై బాణసంచా కాల్పులతో ఆ పార్టీ కార్యకర్తలు సందడి చేశారు. అనంతరం కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు

నిర్వహించారు. నూతన సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, దొంతి రెడ్డి సాంబి రెడ్డి, కేలి వెంకటేశ్వరరావు, కుసుమ, నీలిమ, కిరణ్, ఏ మురళి, ఈ భాస్కర్, డి దాసు, మీరావలి, రామకృష్ణ పాల్గొన్నారు.

తెనాలి తహశీల్ధార్ కార్యాలయంలో ..

ప్రజాశక్తి - తెనాలి

నూతన సంవత్సర వేడుకలను తహశీల్దార్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ అధ్యక్షతన జరిగిన వేడుకలలో కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ తెనాలి యూనిట్ బృందం తహశీల్దార్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్జీవో యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు వి.భిక్షాలు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయంలో ...

ప్రజాశక్తి- తాడేపల్లి

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సోషల్ మీడియా సంయుక్త కార్యదర్శి షేక్ జావీద్ జన్మదిన వేడుకలు, మరియు, 2026 నూతన సంవత్సర వేడుకలు, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు, పొన్నూరు నియోజకవర్గ పరిశీలకులు బుర్రముక్కు వేణుగోపాలసోమి రెడ్డి కార్యాలయంలో తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సర్దార్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రభుత్వ ఆస్తులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి మేక వెంకటరామిరెడ్డి, జిల్లా మైనార్టీ విభాగ కార్యవర్గ సభ్యులు సయ్యద్ సలాం, నియోజకవర్గ గ్రీవెన్స్ విభాగ అధ్యక్షులు మల్లికార్జున్ రెడ్డి, తాడేపల్లి పట్టణ ఎస్సీ, ఎస్టీ, యువజన, సోషల్ మీడియా, ప్రచార విభాగాల అధ్యక్షులు చిలుకోటి శ్రీనివాస మధు, బాలసాని అనిల్, భూపతి కిషోర్, తొట్టెం పూడి వికాస్, షేక్ ఖలీల్, మంగళగిరి పట్టణ ఉపాధ్యక్షులు షేక్ మాబు, తాడేపల్లి పట్టణ సోషల్ మీడియా ఉపాధ్యక్షులు పజ్జూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సిబ్బందితో సబ్ కలెక్టర్ సంజన సింహ

తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో

నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - తెనాలి

నూతన సంవత్సర వేడుకలను స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. సబ్ కలెక్టర్ సంజన సింహ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలలో కార్యాలయ సిబ్బందితోపాటు డివిజన్లోని తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, పలువురు రెవెన్యూ సిబ్బందికి ఆమె నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతూ డైరీలను అందించారు. రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సిబ్బంది కృషి చేయాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం రెండో తేదీ నుంచి తొమ్మిదవ తేదీ వరకు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ జరుగుతుందని ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో డివిజన్‌లోని పలువురు రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

మున్సిపల్ యూనియన్ ఆధ్వర్యంలో

నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - మంగళగిరి

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మంగళగిరి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కేక్ కట్ చేశారు. స్వీట్స్ పంపిణీ చేసుకున్నారు. సిఐటియు నాయకులను, మున్సిపల్ యూనియన్ నాయకులను సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ ఎస్ చెంగయ్య, సీనియర్ యూనియన్ మాజీ కార్యదర్శి పి రామచంద్రరావు, సిఐటియు సీనియర్ నాయకులు జె వి రాఘవులు, వివి జవహర్లాల్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ, సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం బాలాజీ, వృత్తిదారుల సంఘం నాయకులు ఎం చలపతిరావు, యూనియన్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు వై శివ నాగేశ్వరరావు, ఎం వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎం బుక్ కార్మికుల నిరసన దీక్ష

ఎం.బుక్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

తాడేపల్లి ఎం బుక్ కార్మికులకు నైట్ డ్యూటీ కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ కమిటీ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట చేస్తున్న నిరసన దీక్ష గురువారం నాటికి 14 రోజు చేరింది. దీక్షకు మద్దదు తెలిపి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ ఎస్ చెంగయ్య మాట్లాడుతూ ఎం బుక్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి వెంకటేశ్వర్లు, కార్మికులు ఎంబి జయమ్మ, పార్వతి, ఆనంద్, సాంబయ్య, జ్యోతి, నాగేంద్రం పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న కన్నా

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

నూతన సంవత్సర వేడుకలు సత్తెనపల్లి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సత్తెనపల్లి రఘురామ్ నగర్ టిడిపి ప్రజావేదికలో నూతన సంవత్సర వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు సత్తెనపల్లి నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజేపి నాయకులు కార్యకర్తలు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పుష్ప గుచ్చాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నాయకులు కార్యకర్తలు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ బాక్సులు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 18నెలల పాలనలో అభివృద్ధి, సంక్షేమం, కూటమి ప్రభుత్వం సూపరిపాలనలన చేస్తుందని చెప్పారు. నూతన సంవత్సరంలో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం చేస్తున్న గురవయ్య స్నేహితులు

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన గుడిపూడి చెందిన గ్రామానికి బురుసు కుటుంబానికి ఆయన స్నేహితులు 27వేలు ఆర్థిక సహాయం బుధవారం రాత్రి అందజేశారు. గురువయ్య 1995-96 సంవత్సరంలో గుడిపూడి హైస్కూల్లో 10తరగతి చదివారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న స్నేహితులు గురవయ్య భార్య వెంకటరమణకు ఆర్థికసాయం చేసి సానుభూతి తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజలకు శుభాలు కలగాలి

ప్రజాశక్తి - క్రోసూరు

నూతన సంవత్సరంలో ప్రజలకు శుభాలు కలగాలని క్రోసూరు మాజీ యార్డ్ చైర్మన్ కాంద్రు కాశయ్య, నలజాల కోటేశ్వరరావు, మొగల్ జాను పేర్కొన్నారు. స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. గతాన్ని ఒక పాఠంగా మార్చుకుని, భవిష్యత్తును ఒక అవకాశంగా చూస్తూ ముందుకు సాగడమే అసలైన నూతన ఉత్సాహమని అన్నారు. కార్యక్రమంలో ఏపూరి నాగేశ్వరరావు, అనుముల వెంకట్రామి రెడ్డి, చంటి, కరీముల్లా, యోహాను, రవి, మన్నెం శ్రీను, ఎర్రబాలెం లక్ష్మీనారాయణ, రామాంజనేయులు గౌడ్, కొండలు, అనుముల కోటిరెడ్డి, జుజ్జూరు వెంకట్రావు, అనుమల పూర్ణచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

చీఫ్ విప్ జీవి నివాసంలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - వినుకొండ

ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు నివాసంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం వినుకొండ పట్టణంలోని శ్రీ ప్రసన్న రామలింగేశ్వర స్వామి (పాత శివాలయం)లో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నివాసానికి చేరుకోగానే ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు ప్రజలు బారులు తీరారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు వేలాధిగా తరలివచ్చి ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పల్నాడు జిల్లా వివిధ శాఖల అధికారులతో పాటు, వినుకొండ నియోజకవర్గ రెవిన్యూ తాసిల్దార్లు, ఎంపీడీవోలు, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, అటవీ శాఖ, వినుకొండ మునిసిపల్ శాఖ, ఎన్ఎస్పి, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ వివిధ శాఖల అధికారులతో వినుకొండ పట్టణ, రూరల్ సీఐలు, ఎస్సైలు సిబ్బంది చీఫ్ ఇప్పు జీవి ఆంజనేయులును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వినుకొండ పట్టణంలోని డాల్మిల్, ఫర్టిలైజర్స్, మెడికల్స్, కిరాణా మర్చంట్, కూరగాయల మార్కెట్, వస్త్ర వ్యాపార, వాణిజ్య వ్యాపార అసోసియేషన్ల సభ్యులందరూ చీఫ్ విప్ప జీవి గారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వినుకొండ బారసోసియేషన్ న్యాయవాదులు, ప్రభుత్వ ప్రైవేటు వైద్యులు జీవిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు ఆయన అభిమానులు వేలాది సంఖ్యలో తరలివచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి వారి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందరరేగా ప్రజలను ఉద్దేశించి చీఫ్ విప్ జీవి మాట్లాడుతూ 2026 సంవత్సరం ప్రతి ఒక్కరికి శుభాలను చేకూర్చాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన మనసారా అభిలాషిం చారు. ఏడాది ప్రజలు సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, ఆకాంక్షలతో ముందుకు సాగాలని కోరారు. సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం శక్తి వచ్చిన లేకుండా పనిచేస్తున్న నియోజకవర్గ అధికార యంత్రాంగానికి ఆయన అభినందనలు తెలిపారు. తనపై ఎంత అభిమానంతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సామాన్య ప్రజలతో పాటు అధికారులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చీఫ్ విప్ జీవి ఆంజనేయులకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన ప్రజానీకానికి కార్యాలయ సిబ్బంది మిఠాయిలు అందజేశారు. అనంతరం అల్పాహారం ఏర్పాటు చేశారు.

జీవిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన పోలీసులు

కార్యకర్తలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే జూలకంటి

నూతనసంవత్సర వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జూలకంటి

ప్రజాశక్తి - మాచర్ల

పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్క కార్యకర్తకు అండగా ఉంటానని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం మాచర్ల పట్టణంలోని వివిఎన్ గార్డెన్స్ నందు నూతన సంవత్సర వేడుకలు తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలతో కలసి జరుపుకున్నారు. నూతన సంవత్సర కేక్ కట్ చేశారు. పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అథారిటి చైర్మన్ చిరుమామిళ్ళ మధుబాబు ఎమ్మెల్యేని కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేసుకున్నామని, ఇంకా చేసుకోవాల్సిన పనులు చాలా ఉన్నాయన్నారు. కార్యకర్తలు, నాయకుల అండతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలుగుదేశం జనసేన భారతీయ జనతా పార్టీ నాయకులకు కార్యకర్తలకు, మాచర్ల నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు శ్రీశైలం రోడ్డులోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు ఈ ర్యాలీలో తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు నియోజకవర్గ ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు. ఎమ్మెల్యేని కలసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్, మాచర్ల, దుర్గి మార్కెట్‌యార్డు చైర్మన్లు మల్లేశ్వరి మధుయాదవ్, లింగా బ్రహ్మయ్య, నాయకులు యెనుముల కేశవరెడ్డి, మద్దిగపు చినవెంకట్రామిరెడ్డి తదితరులున్నారు.

కేక్ కట్ చేస్తున్న టిడిపి జిల్లా కార్యదర్శి రమేష్

లక్ష్యసాధనలో ముందంజలో ఉండాలి

ప్రజాశక్తి - పెదకూరపాడు

లక్ష్యాన్ని నిర్ణయించుకొని దాన్ని సాధించడంలో ప్రతి ఒక్కరూ ముందంజలో ఉండాలని టిడిపి జిల్లా కార్యదర్శి ఆర్తిమళ్ల రమేష్ కోరారు. గురువారం నూతన సంవత్సర సందర్భంగా పలు చర్చిల్లో కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందాలంటే శాంతి సహనంతో ఉండాలన్నారు. అప్పుడు మాత్రమే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఆయన వెంట పెదకూరపాడు సర్పంచ్ గుడిపూడి రాజు, పలువురు నాయకులు, కార్యకర్తలు చర్చి పెద్దలు పాల్గొన్నారు.

నేడు "ప్రజా దర్బార్"

ప్రజాశక్తి - మాచర్ల

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం "ప్రజా దర్బార్" కార్యక్రమం నిర్వహించబడుతుందని శాసనసభ్యుల వారి కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. పట్టణంలోని నెహ్రూ నగర్ టిడిపి కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి వినతులు స్వీకరిస్తారని చెప్పారు. విజ్ఞాపన పత్రాలకు సంబంధిత వారి ఆధార్ కార్డు జిరాక్స్ జతచేయాలని సూచించారు. కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీలక్ష్మి అమ్మవారి ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - దుర్గి

నూతన సంవత్సరం సందర్భంగా దుర్గి మండలం అడి గొప్పుల శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మి ఆలయానికి గురువారం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందస్తుగా తీసుకున్న చర్యల వలన భక్తులకు ఎటువంటి అసౌకర్యానికి గురికాలేదు. అమ్మ వారి సన్నిధికి విచ్చేసిన భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం చేశారు. ఆయా కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు శాశ్వత ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు, దేవాదాయ ధర్మదాయ శాఖా ఆలయ కమిషనర్ ఆదిశేష నాయుడు ఆధ్వర్యంలో జరిగాయి.

అన్నదానం చేస్తున్న ఆదిశేషనాయుడు

మాట్లాడుతున్న శాంసన్

ప్రజారోగ్య భద్రతకు కృషి చేయాలి

ప్రజాశక్తి - క్రోసూరు

ప్రజారోగ్య భద్రతకు వైద్య సిబ్బంది కృషి చేయాలని, దీంతోపాటు ప్రజల ఆచార వ్యవహారాలు, జీవనశైలిలో సమగ్ర మార్పు రావాలని ఆరోగ్య విస్తరణ అధికారి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం క్రోసూర్ తాలూకా యూనిట్ అధ్యక్షులు, పల్నాడు జిల్లా ఆరోగ్య విస్తరణ అధికారుల సంఘం అసోసియేట్ అధ్యక్షులు శిఖా శాంసన్ ఆకాంక్షించారు. ఈ దిశగా అందరూ నూతన సంవత్సరం సందర్భంగా సంకల్పం తీసుకోవాలని శాంసన్ విజ్ఞప్తి చేశారు గురువారం పల్నాడు జిల్లా క్రోసూరు మండలం క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోని సిబ్బంది ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వ్యాధుల బారిన పడిన రోగుల ముఖాలలో చిరునవ్వే వైద్య సిబ్బంది లక్ష్యం కావాలని, రోగులకు సేవ చేయటం వైద్య సిబ్బందికి లభించిన ఒక మహత్తర అవకాశంగా భావించాలని శాంసన్ సూచించారు

కేక్ కట్ చేస్తున్న బ్యాంకు సిబ్బంది

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా వేడుకలు

ప్రజాశక్తి - క్రోసూరు

సరికొత్త ఆశయాల మధ్య నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా, క్రోసూరు మండలం దొడ్లేరు గ్రామంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సర వేడుకలను ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. యానిమేటర్, బీసీ పాయింట్ మరియు బ్యాంక్ వినియోగదారుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్లు శివ శంకర్ నాయక్,మరియు కోటేశ్వరరావు, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యానిమేటర్లు, బీసీ పాయింట్ మహిళలతో కలిసి నూతన సంవత్సర కేక్‌ను కట్ చేశారు. అనంతరం బ్యాంక్ సిబ్బంది అందరికీ మరియు మహిళా ప్రతినిధులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో మహిళా యానిమీటర్ల పాత్ర కీలకమని ఈ సందర్భంగా మేనేజర్లు కొనియాడారు.

394 రోజులుగా ఎసిసి సిమెంట్ కంపెనీ కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

ఎసిసి సిమెంట్ కంపెనీ కార్మికులు తమకు రావలసిన నష్టపరిహారం కోసం చేస్తున్న పోరాటం గురువారం నాటికి 394వ రోజుకి చేరుకుంది. దీక్షలను సిఐటియు తాడేపల్లి కార్యదర్శి వేముల దుర్గారావు సిమెంట్ కంపెనీ కార్మికులతో కలిసి దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా దీక్షలో కూర్చున్న వారిని ఆయన అభినందించారు. దీక్షల్లో ఎం.శారద, వేముల లక్ష్మి, డి.రమణ, డి.సువర్ణకుమారి, వేము రిబ్కా కూర్చున్నారు. కూరపాటి స్టీఫెన్ అధ్యక్షతన జరిగిన దీక్ష సమావేశంలో సిఐటియు నాయకులు వేముల దుర్గారావు మాట్లాడుతూ సిమెంట్ కంపెనీ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం యొక్క వైఖరి న్యాయం అయింది కాదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఎసిసి కార్మికుల పట్ల వ్యవహరించడం సరైనది కాదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని ఎసిసి సిమెంట్ కంపెనీ కార్మికుల నష్టపరిహార సమస్యను పరిష్కరించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు ఆల్ ఇండియా మహా సభలు విశాఖపట్నంలో జరుగుతున్నందున సిమెంట్ కంపెనీ కార్మికుల యావన్మంది నాలుగో తేదీన విశాఖపట్నం చేరుకోవాలని ఆయన కోరారు. సిమెంట్ కంపెనీ కార్మికుల పోరాటానికి సిఐటియు మహాసభలు నిర్ణయాలు, భవిష్యత్తులో జరగబోయే ఉద్యమాలు, ఎసిసి కార్మికులు పోరుబాటే ఆయుధంగా సాగాలని కోరారు. మొక్కవోని దీక్షతో పోరాడుతున్నందుకు మరొకసారి ఎసిసి కార్మికులకు సిఐటియు అభినందనలు తెలియజేస్తున్నది దుర్గారావు అన్నారు. ఈ కార్యక్రమంలో కూరపాటి స్టీవెన్, సాంబశివరావు, సూర్య ప్రకాష్, నాగేశ్వరరావు, సుభాని, దానయ్య, సాంబశివరావు, గురవయ్య, ఇమాంబి, తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న కార్మికులు

ఇబ్రహీంను సన్మానిస్తున్న నాయకులు

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - మంగళగిరి

పాత బస్టాండ్ సెంటర్‌లోని గుడ్ విల్ ముస్లిం సంక్షేమ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మొహమ్మద్ ఇబ్రహీం ఆధ్వర్యంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొహమ్మద్ ఇబ్రహీం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మైనార్టీ నాయకులు సుభాని, మస్తాన్ వలి, నాగుల్ మీరా, చాన్ బాషా, మస్తాన్ వలి, అన్వర్, బషీద్, శాలిమర్ బాషా షరీఫ్, బాషా వలి, గౌస్, అంజాద్ బాషా బాబీ, జమ్ముల శ్రీనివాసరావు, గుడిపాటి అర్జునరావు, సయ్యద్ షరీఫ్, డి.వెంకటేశ్వరరావు, న్యాయవాదులు జవ్వాది విజయ్ కుమార్, శ్రీ భాష్యం రంగనాథ్, జావిద్ బ్రదర్స్, నజీర్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వవికాసం పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి లోని రాయల్ బాంకెట్స్ లో గురువారం సాయంత్రం జరిగిన సభలో " సుభానీ ఖయాల్" రచించిన "జుమావముముబారక్.. ఇస్లాం వ్యక్తిత్వవికాసం" పుస్తకాన్ని బోధి రేకా కృష్ణార్జునరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మతసామరస్యం ఆవశ్యకతను వివరించారు. సుభానీ తన పుస్తకంలో మతాలతో సంబంధంలేని సమసమాజాన్ని స్థాపించడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమానికి మానవతా వేదిక అధ్యక్షులు కవి గోలి మధు అధ్యక్షు వహించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త నన్నపనేని నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో యర్రగుంట్ల పాణిరావు, యోగా గురూజీ పడమట రాధాకృష్ణ, పొట్లాబత్తుని లక్ష్మణరావు, కళారత్న సయ్యద్ నశీర్ అహ్మద్, మొహమ్మద్ యూసఫ్ పాల్గొన్నారు.

పలు దేవాలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి - తెనాలి

నూతన సంవత్సరం వేడుకలలో భాగంగా పలు దేవాలయాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాత సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ కొత్త సంవత్సరం 2026 కు స్వాగతం పలుకుతూ బుధవారం రాత్రి 10 గంటల నుంచి గురువారం తెల్లవారుజాము ఒంటిగంట వరకు ప్రార్థనలు జరిగాయి. స్థానిక బోస్ రోడ్డులోని క్రీస్తు దేవాలయంలో దైవజనులు రెవరెండ్ డి. ఏసురత్నం, రెవరెండ్ ఎం బి వి ప్రకాష్ బాబు, రెవరెండ్ డి.సాల్మన్ రాజు, రెవరెండ్ డేవిడ్ ఇమ్మానుయేల్ వాక్యోపదేశం చేశారు.

నిత్య సహాయ మాత మందిరంలో..

స్థానిక చెంచుపేట నిత్య సహాయమాత మందిరంలో నూతన సంవత్సర ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం వరకు జరిగిన ప్రార్థనలలో తెనాలి పరిసర గ్రామాలకు చెందిన పలువురు భక్తులు పాల్గొన్నారు. విచారణ గురువులు విజయకుమార్, స్లీవయ్య ప్రత్యేక దైవ సందేశాన్ని అందించారు.

విద్యాసంస్థలలో సంకల్పం డ్రాప్ బాక్స్‌ల ఏర్పాటు

ప్రజాశక్తి - తెనాలి

మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు సంకల్పం పేరిట అవగాహన కార్యక్రమాలు చేపట్టిన సంగతి తెలిసిందే. దీనికి తోడు మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయం పై సమాచారాన్ని గోప్యంగా తెలుసుకునేందుకు విద్యాసంస్థలలో డ్రాప్ బాక్సుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్, ఎస్ఐ ఆనంద్ ఆధ్వర్యంలో నాలుగు కళాశాలలు, ఆరు హైస్కూల్స్‌లో గురువారం డ్రాప్ బాక్స్ లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఆనంద్ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగంపై ఎలాంటి సమాచారం ఉన్నా వివరాలను డ్రాప్ బాక్స్ లో ఉంచాలని విద్యార్థులను కోరారు. విద్యార్థులు తమ వివరాలను తెలియచేయాల్సిన అవసరం లేదన్నారు. ఒకవేళ సమాచారం ఇచ్చిన వారి వివరాలు తెలిసినా గోప్యంగా ఉంచుతామని భరోసా కల్పించారు. తొలుత బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో డ్రాప్ బాక్సులను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రాప్ బాక్సులను ఏర్పాటుచేయిస్తున్న రూరల్ ఎస్ఐ ఆనంద్

ప్రజాశక్తి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తహశీల్దార్ గోపాలకృష్ణ

ప్రజాశక్తి - తెనాలిరూరల్

రాష్ట్రంలో జరుగుతున్న విశేషాలను దృశ్యమాలికల్లా కళ్ళముందు ఉంచుతున్న జర్నలిస్టులు ఎంతైనా ప్రశంసనీయులని తెనాలి తహసీల్దార్ కె.వి.గోపాలకృష్ణ అన్నారు. స్థానిక కొత్తపేట తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం 2026 ప్రజాశక్తి తెనాలి క్యాలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమవుతున్న వార్తా కథనాలు వాస్తవికతను ప్రతిబింబిస్తాయని అన్నారు. ప్రజాశక్తి క్యాలండర్ ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో తెనాలి తహశీల్దార్ కార్యాలయాన్ని మోడల్ కార్యాలయంగా తీర్చిదిద్దిన ఘనత గోపాలకృష్ణకే దక్కుతుందని ప్రజాశక్తి తెనాలి డివిజన్ ఇన్‌చార్జి గురిందపల్లి ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి స్వయంగా పిలిచి తెనాలి తహశీల్దార్ గోపాలకృష్ణని అభినందించడం, తెనాలి కీర్తి మరింత పెరిగిందని అన్నారు. కార్యక్రమంలో తెనాలి రిపోర్టర్లు మంచికలపూడి రవికుమార్, అంబటి శ్యామ్ సాగర్ పాల్గొన్నారు.

దామర్ల రాజును సన్మానించిన మాస్టర్ వీవర్స్

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ సభ్యులు దామర్ల శివవెంకటరాజు తెలుగుదేశం పార్టీ గుంటూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడిగా నియమితులైనందుకు అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఆత్మీయ సత్కారం చేశారు. షరాఫ్ బజారులోని మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళగిరి మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జన్నాదుల వరప్రసాదరావు (మణి) అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పణిదపు వీరాస్వామి, కార్యదర్శి రావెల శివసత్యనారాయణ, కోశాధికారి వూట్ల పెదసుబ్బారావు, కార్యనిర్వాహక సభ్యులు దామర్ల చక్రవర్తి, మునగాల సీతారామస్వామి, నీలి నాగమల్లేశ్వర రావు, కొల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జొన్నాదుల మణి మాట్లాడుతూ తమ అసోసియేషన్ సభ్యుడైన దామర్ల శివవెంకటరాజు గతంలో మంగళగిరి మున్సిపల్ కౌన్సిలర్‌గా, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా, టీడీపీ మంగళగిరి పట్టణ అధ్యక్షుడిగా సేవలంది ంచారని, తాజాగా టీడీపీ గుంటూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడిగా నియమితులు కావడంపై హర్షం వ్యక్తంచేశారు. తమ అసోసియేషన్ నుంచి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మున్సిపల్ చైర్మన్‌గా, రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, అలాగే, మంత్రిగానూ సేవలందించారని తెలిపారు. తమ అసోసియేషన్ సభ్యులు పలువురు వివిధ పదవులు నిర్వర్తించారని గుర్తుచేశారు.

దేశ రాజకీయాల్లో తీవ్ర సంక్షోభం - ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - మంగళగిరి

దేశ రాజకీయాల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో అవి ప్రజలకు సానుకూలమా? ప్రతికూలమా? అన్న అంశంపై ప్రజలు లోతైన పరిశీలన చేయాల్సిన అవసరం ఉందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు..గురువారం మంగళగిరి పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కోటా మాల్యాద్రి, నియోజవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చిల్లపల్లి శ్రీనివాసరావు

రాంగ్ డెసిషన్ సినిమా పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - మంగళగిరి

హెల్మెట్, సీట్ బెల్ట్ ఆవశ్యకతను తెలియజేస్తూ జనసేన యువనేత జన్న రాజేష్ నిర్మించిన షార్ట్ ఫిలిం పోస్టర్ ను ఏపీ ఎమ్ ఎస్ఐడిసి ఛైర్మెన్, జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భగా చిల్లపల్లి మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి అంకితం చేస్తూ నిర్మించిన షార్ట్ ఫిల్మ్ రాంగ్ డెసిషన్ పేరుతో వస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో సినిమా డైరెక్టర్ & డిఓపి, నటుడు పవన్ లావురి, అసిస్టెంట్ డైరెక్టర్ డీకే బుడ్డు, స్టోరీ, స్క్రీన్ ప్లే, నటుడు దినేష్ కంద్రకుంట, నటి నటులు మౌనిక, శశి రాజు, కోటేశ్వరి, పండు, దీక్ష మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న టిడిపి నాయకులు

కంటి ఆపరేషన్ బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని చిర్రావూరు గ్రామంలో కంటి ఆపరేషన్ చేయించుకొని ఇంటి వద్ద ఉంటున్న దేవిశెట్టి శివ నారాయణకు గురువారం ఉదయం మంగళగిరి ఏఎంసీ డైరెక్టర్ వీరిశెట్టి శ్రీనివాసరావు 5000 రూపాయలను తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా వీరిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో ఐదువేల రూపాయలను కంటి ఆపరేషన్ అయి ఇంటి వద్ద ఉంటున్న శివ నారాయణకు అందజేశామన్నారు. గ్రామంలో పేదలకు ఏ సమస్య వచ్చినా టిడిపి పార్టీ అండగా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ నాయకులు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

కుంచనపల్లిలో పారిశుద్ధ్య కార్మికులకు స్వీట్లు అందజేస్తున్న వైఎస్ఆర్‌సిపి నాయకులు

పారిశుద్ధ్య కార్మికులకు స్వీట్లు అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి గ్రామ సచివాలయంలో గురువారం ఉదయం వైఎస్ఆర్సిపి నాయకులు పారిశుద్ధ్య కార్మికులకు స్వీట్ బాక్సులను అందజేశారు. అనంతరం వైఎస్ఆర్‌సిపి గ్రామ కార్యాలయంలో నూతన సంవత్సర కేక్ కట్ చేసి, ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమర నాగయ్య, వైఎస్ఆర్‌సిపి గ్రామ అధ్యక్షులు మిరియాల రాంబాబు, వైఎస్ఆర్‌సిపి గ్రామ సీనియర్ నాయకులు గడ్డం తాతయ్య, కూరపాటి సాంబిరెడ్డి, గ్రామం మాజీ సర్పంచ్ బిరుదు గడ్డ విజయేందర్ రావు, వైఎస్ఆర్‌సిపి యువజన విభాగం మండల ఉపాధ్యక్షులు నల్లపు రాంబాబు, కె.జాన్ తదితరులు పాల్గొన్నారు.

19 ఎపిఎన్‌జిఒ జిల్లా కార్యవర్గ ఎన్నికలు

ప్రజాశక్తి-గుంటూరు

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ గుంటూరు జిల్లా ఎన్నికలు ఈనెల 19న నిర్వహించనున్నారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.విద్యాసాగర్, డి.వి.రమణ గురువారం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కిలారు జగదీశ్వరరావును ఎన్నికల అధికారిగా నియమించారు. ఈ షెడ్యూల్ ప్రకారం జిల్లా శాఖలోని అధ్యక్ష కార్యదర్శులతో సహా 17 పోస్టులకు జనవరి 4న నామినేషన్ స్వీకరణ, 19న ఓటింగ్ ఉంటుందని ఎన్నికల అధికారి తెలిపినారు. ఈ ఎన్నికల్లో గుంటూరు సిటీ, ప్రతిపాడు, దుగ్గిరాల, అమరావతి, మంగళగిరి, తెనాలి, పొన్నూరు తాలూకా యూనిట్లకు చెందిన 256 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొని ఎపిఎన్‌జిఒ జిల్లా శాఖకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటారని తెలిపారు.

విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేస్తున్న లావు రత్తయ్య

విజ్ఞాన్ వర్సిటీలో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీ, విజ్ఞాన్స్ లారా, విజ్ఞాన్స్ ఫార్మసీ, విజ్ఞాన్స్ జూనియర్ కాలేజీలలో గురువారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించటానికి సరికొత్త మార్గాలను అన్వేషించాలన్నారు. మార్పును స్వీకరించడమే అభివృద్ధికి మూలం అని అన్నారు. విద్యార్థుల్లో దయ, కృతజ్ఞత, మానవత్వం, ఇతరులకు సహాయం చేసే మనస్తత్వం పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. అనంతరం విద్యార్థులతో 2026 సంవత్సరానికి సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు. కేక్‌ను కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో విజ్ఞాన్స్ యూనివర్సిటీ విసి కల్నల్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పిఎంవి రావు, లారా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.ఫణీంద్రకుమార్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ.శ్రీనివాసబాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జే.మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

కెఎల్‌పి స్కూల్లో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో గురువారం నూతన సంవత్సర వేడుకులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న స్కూల్ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో జీవించాలన్నారు. వినూత్న ఆలోచన ధోరణిని అలవర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందర్నీ ఆకట్టుకున్నాయి.

నూతన కార్యవర్గం

సీనియర్ సిటిజన్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని జిల్లా సీనియర్ సిటిజన్ సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో 2026- 27 సంవత్సరాలకు సంస్థ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షులుగా మన్నే సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా మదమంచి నాగమల్లేశ్వరరావు, పావులూరి చిన్నసుబ్బారావు, కట్టా వలరాజు, కొమ్మాలపాటి శ్రీనివాసరావు, నల్లపునేని సుబ్బారావు, మొక్కపాటి తులసి మల్లేశ్వరరావు, రాయపాటి శరశ్చంద్రప్రసాద్, మదమంచి సుధాకర్, ఘంటా నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కోగంటి బసవ నందికేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా మొక్కపాటి కష్ణవరప్రసాద్, మన్నె పార్వతి, కార్యవర్గ సభ్యులుగా సోమేపల్లి రాంప్రసాద్, లంక విజయబాబు, గుమ్మడి రంగనాయకమ్మ, పాటిబండ్ల సాంబశివరావు, తాళ్ల నారపరెడ్డి ఎన్నికయ్యారు.

అంధులు, బధిరులతో కలెక్టర్ నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

అంధులు, బదిరులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. నూతన సంవత్సర వేడుకలను జిల్లా కలెక్టర్ గురువారం బ్రాడీపేటపేటలో ఉన్న షిరిడిసాయి దీనజనులసేవా సమితి ఆశ్రమంలో నిర్వహించి, బధిర విద్యార్థులకు దుప్పట్లు, పండ్లను పంపిణీ చేశారు. బధిర విద్యార్థులతో నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటూ ఉల్లాసంగా గడిపారు. విద్యార్థుల చదువు, పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. జీవితంలో ఏమి కావాలని కోరుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఏమి కావాలో స్పష్టమైన కోరికతో దానిలో ఉన్నట్లు ప్రతి క్షణం ఊహించు కుంటూ ఉండటం వలన కలలు నిజమౌతాయని సూచించారు. ఆశయాలకు అనుగుణంగా కష్టపడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, తహసిల్దార్లు వెంకటేశ్వరరావు, సుభాని, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలెక్టర్, జెసి, ఇతర అధికారులు

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎపిఎన్‌జిఒ నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

నూతన సంవత్సరం సందర్భంగా గురువారం ఏపీ ఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్‌ఒ ఖాజావలి, ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి ఎం.పద్మావతి, మెడికల్ అండ్ హెల్త్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ శోభారాణి, డిఎంహెచ్‌ఒ డాక్టర్ కె.విజయలక్ష్మి తదితరుల్ని కలిసి అసోసియేషన్ డైరీ అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు, కార్యదర్శి ఏ.శ్యాంసుందరశ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్.నాగూర్‌షరీఫ్, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌పిఎస్ సూరి, కళ్యాణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న అసోసియేషన్ నాయకులు

నగర అభివృద్ధిలో సమిష్టి భాగస్వామ్యం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగర అభివృద్ధి, సుందరీకరణకు పెద్దఎత్తున కార్యాచరణ సిద్ధం చేశామని, నగర ప్రజలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛందసంస్థలు, సీనియర్ సిటిజన్స్ సహకారం అందించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా కమిషనర్‌ను క్యాంప్ కార్యాలయంలో నగర పురప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, వివిధ సంస్థలు, సంఘాల ప్రతినిధులు కలిసి పూలమొక్కలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరాన్ని స్వచ్ఛ, సుందర, పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దుకోవడానికి అందరి భాగస్వామ్యంతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. గతేడాది ప్రతి ఒక్కరి సహకారంతో చేపట్టిన సంస్కరణల ఫలితంగా జాతీయస్థాయిలో గుంటూరు నగరపాలక సంస్థ మెరుగైన స్థానాన్ని సాధించిందన్నారు. రానున్న కాలంలో మరింతగా కృషి చేస్తామని చెప్పారు.

కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న అధికారులు

తులసి గ్రూప్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అరండల్‌పేటలోని తులసి గ్రూప్ యాజమాన్యం ఆధ్వర్యంలో యోగి భవన్‌లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు తులసి గ్రూప్స్ చైర్మన్ తులసి రామచంద్రప్రభు, ఉగ్గిరాల సీతా రామయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా రామచంద్రపభ్రు మాట్లాడుతూ రైతుసోదరులు, ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, పాడిపంటలు సంమృద్ధిగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లు తులసి ప్రభు చేతులమీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏటుకూరు మాజీ సర్పంచ్ ఉగ్గిరాల సీతారామయ్య, ప్రముఖ వ్యాపారవేత్త మలిశెట్టి సుబ్బారావు, కార్పొరేటర్ దాసరి లక్ష్మీదుర్గ, వాసు, గోరంట్ల కార్పొరేటర్ యర్రం శెట్టి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రప్రభుకు శుభాకాంక్షలు తెలుపుతున్న వ్యాపారవేత్తలు

రేపటి నుండి కెఎల్‌యులో జాతీయస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

కేఎల్ యూనివర్శిటీలో ఈ నెల 3 నుండి 5 వరకు సౌత్ జోన్ ఆలిండియా అంతర యూనివర్శిటీల పురుషుల బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు కెఎల్ యు వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారధి వర్మ గురువారం తెలిపారు. వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, క్రీడల డైరెక్టర్ డాక్టర్ కె.హరికిషోర్, ఐక్యు ఎసి డీన్ డాక్టర్ రామకృష్ణ లతో కలిసి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు తత్వాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపినప్పుడే సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని అన్నారు. ఈ టోర్నమెంట్‌లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 128 విశ్వ విద్యాలమాల నుండి సుమారు 900 మంది క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాప్ డైరెక్టర్ అనిమిని రవినాయుడు, గౌరవ అతిథిగా పున్నయ్య చౌదరి పాల్గొంటారని తెలిపారు. క్రీడల డైరెక్టర్ డాక్టర్ కె.హరికిషోర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో సౌత్ జోన్ ఆలిండియా అంతర యూనివర్శిటీల పురుషుల బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలతో పాటు అఖిల భారత స్థాయి పోటీలు జరగడం కేఎల్ యూనివర్శిటీకి గర్వకారణమని తెలిపారు. ఈ క్రీడల్లో పాల్గొనేందుకు వస్తున్న క్రీడాకారులకు అన్ని వసతులతో కూడిన అంతర్జాతీయ ప్రమాణాల ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు విశ్వవిద్యాలయం తరఫున వసతి, భోజనం, వైద్య సదుపాయాలు కల్పించినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ పోటీల ద్వారా యువతలో క్రీడాసూర్తి మరింత పెరుగుతుందని, జాతీయ స్థాయిలో ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి వస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న విసి డాక్టర్ పార్ధసారధి వర్మ తదితరులు